సమాచారం

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

మూసాపేట: వివేక్‌నగర్ 11కేవీ ఫీడర్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఎలక్ట్రికల్ ఏఈ శంకర్ తెలిపారు. బుధవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు బాలాజీనగర్, వివేక్‌నగర్‌లోని కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. అదే విధంగా మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5గంటల వరకు న్యూ బాలాజీనగర్, వివేక్‌నగర్‌లోని మరికొన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు.

నేటి నుంచి స్వామివారికి నిత్య కల్యాణం

ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి సప్తగిరి కాలనీలోని శ్రీసీతారామచంద్రస్వామి దేవాలయంలో ప్రతిరోజు స్వామివారికి నిత్య కల్యాణం నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 11గంటలకు కల్యాణోత్సవం ప్రారంభం అవుతుందన్నారు. కల్యాణోత్సవంలో పాల్గొనాలనుకునే భక్తులు ఆలయంలో ఒకరోజు ముందుగా తమ పేర్లను నమోదు చేయించుకోవాలని కోరారు. భక్తులు సంప్రదాయ దుస్తుల్లో రావాలని సూచించారు.

నేడు వార్డు కార్యాలయంలో కంటి వెలుగు ప్రారంభం

మూసాపేట: ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాల మేరకు ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సారథ్యంలో గురువారం ఉదయం 8గంటలకు బాలాజీనగర్ వార్డు కార్యాలయంలో కంటి వెలుగు కార్యక్రమం స్థానిక కార్పొరేటర్ పగుడాల శిరీష చేతుల మీదుగా ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ శ్రేణులు, నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు, స్థానికులు పాల్గొని జయప్రదం చేయాలని బాలాజీనగర్ డివిజన్ అధ్యక్షుడు సీహెచ్. ప్రభాకర్‌గౌడ్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

నేడు ఎన్‌టీఆర్ జయంతి

కేపీహెచ్‌బీకాలనీ: విశ్వవిఖ్యాత నట సార్వభౌమ, మాజీ ముఖ్యమంత్రి, స్వర్గీయ నందమూరి తారక రామారావు వర్ధంతి సందర్భంగా బుధవారం ఉదయం 7.30 గంటలకు కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఎన్‌టీఆర్ విగ్రహానికి నివాళులర్పించనున్నట్లు కేపీహెచ్‌బీ కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు ఓ ప్రకటనలో తెలిపారు. అనంతరం మలేషియన్ టౌన్‌షిప్ వద్ద రెయిన్ ట్రీపార్కు ముఖద్వారం, హోటల్, విశ్రాంతి గదులు ప్రారంభిస్తారని పేర్కొన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఎన్‌టీఆర్ అభిమానులు విచ్చేసి కార్యక్రమాలను జయప్రదం చేయాలని కోరారు.


క్లుప్తంగా

ప్రారంభోత్సవం



ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్ డివిజన్ పరిధిలోని కమల ప్రసన్ననగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ముత్తూట్ ఫైనాన్స్ కార్యాలయాన్ని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ మంగళవారం ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు, బీఆర్‌ఎస్ నాయకులు సంజీవరెడ్డి, శ్రీనివాస్‌యాదవ్, చంద్రకాంత్‌రావు, రాఘవులు, చంద్రమోహన్ సాగర్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కంటి వెలుగు కేంద్రం పరిశీలన



ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీసీ రవీందర్‌కుమార్

ఆల్విన్‌కాలనీ: పాపిరెడ్డినగర్‌లోని వీరాంజనేయ శివాలయం కమిటీహాల్‌లో గురువారం నుంచి కంటి వెలుగు కార్యక్రమం ప్రారంభమవుతుందని కూకట్‌పల్లి డీసీ రవీందర్‌కుమార్ తెలిపారు. మంగళవారం బస్తీ అధ్యక్షుడు ఊట్ల చంద్రారెడ్డితో కలిసి కమిటీ హాల్‌లో ఆయన ఏర్పాట్లను పరిశీలించారు. శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, కూకట్‌పల్లి కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణలు ముఖ్యఅతిథులుగా హాజరై ప్రారంభిస్తారని తెలిపారు. కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ డాక్టర్ సంధ్యారాణి, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ తీర్థసి తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

నిజాంపేట్: నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి 7వ డివిజన్‌లోని శ్రీనివాసనగర్ కాలనీలోని అయ్యప్పస్వామి ఆలయ నిర్మాణానికి దాతలు చేయూతను అందిస్తున్నారు. 13వ డివిజన్ కార్పొరేటర్ ఆవుల పావని తన వంతుగా రూ.50వేల నగదును అందజేయగా మంగళవారం సదరు మొత్తాన్ని ఆవుల జగన్‌యాదవ్ చేతుల మీదుగా ఆలయ కమిటీ సభ్యులు ధన్‌రాజ్‌యాదవ్, ఉంగరాల శ్రీనివాస్‌లకు అందజేశారు. బీఆర్‌ఎస్ నాయకులు తల్లూరి సాయిముదిరాజ్, యువకులు వినోద్, దోసకంటి నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

రోడ్లను విస్తరించండి..

కానీ స్తంభాలను తొలగించండి

- రాత్రి వేళల్లో స్తంభాలను ఢీకొంటున్న వాహనాలు
- ఒరిగిపోయి ప్రమాదకరంగా మారుతున్న వైనం



ఆల్విన్‌కాలనీ ప్రధాన రోడ్డులో..



ఇటీవల ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభాన్ని మారుస్తున్న విద్యుత్ సిబ్బంది

ఆల్విన్‌కాలనీ: రోడ్ల మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాలు తొలగించకపోవడంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని స్థానికులు చెబుతున్నారు. ఈ స్తబాలను తొలగించక ముందే డివైడర్లను నిర్మించడం ఎంత వరకు సబబని ప్రశ్నిస్తున్నారు. దీంతో రోడ్డు మరింత కుంచించుకుపోతోందని చెబుతున్నారు. నాలుగు రోజుల క్రితం ఓ వాహనం విద్యుత్ స్తంభాన్ని ఢీకొనడంతో హైటెన్షన్ స్తంభం వంగిపోయింది. స్థానికులు ఈ విషయాన్ని కార్పొరేటర్ దృష్టికి తీసుకెళ్లటంతో స్తంభాన్ని తొలగించటానికి చర్యలు తీసుకున్నారు.

◆ కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలోని ఆల్విన్‌కాలనీ డివిజన్ ఉషాముళ్లపూడి రోడ్ 100 ఫీట్ల రహదారి విస్తరణలో భాగంగా రోడ్డుకు ఇరువైపులా ఉన్న హైటెన్షన్ విద్యుత్ స్తంభాలను తొలగించాల్సి ఉంది. రోడ్డును విస్తరించి స్తంభాలను అలాగే వదిలేయడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.

◆ కుత్బుల్లాపూర్ సర్కిల్ నుంచి హైటెక్ సిటీకి.. కూకట్‌పల్లి సర్కిల్ నుంచి కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలోని పారిశ్రామికవాడకు నిత్యం వందలాది వాహనాలు వెళ్తుంటాయి. గతంలో ఈ రహదారి సుమారు 60 అడుగుల వెడల్పులో ఉండేది. రహదారిని విస్తరించకుండా మధ్యలో డివైడర్‌ను ఏర్పాటు చేయటంతో అది కాస్తా కుంచించుకుపోయింది. అంతేకాక రోడ్డుకు ఇరువైపులా చిరువ్యాపారస్తులు తమ వ్యాపారాలను చేసుకోవటంతో ఇరుకుగా మారి రాకపోకలకు ఇబ్బందికరంగా తయారైంది.

◆ ఎల్లమ్మ చెరువు నుంచి భాగ్యనగర్ కాలనీకి వెళ్లే రోడ్డులో మూల మలుపులుతో పాటు స్థానికంగా కూడా దేవాలయం వద్ద మరీ ఇరుకైన రహదారి ఉండటంతో పాటు స్థానికంగా ఉన్న ఎతైన భవనాలకు సెల్లార్‌లు ఉన్నాయి. సెల్లార్‌ల నుంచి వాహనాలను బయటకు తీయాలంటే ఇబ్బందులు ఎదురవుతున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు.

◆ ఇప్పటికైనా ట్రాఫిక్, విద్యుత్, జీహెచ్‌ఎంసీ శాఖల అధికారులు సమన్వయం చేసుకొని రోడ్ల మధ్యలో ఉన్న స్తంభాల తొలగింపునకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

‘కంటి వెలుగు’ను సద్వినియోగం చేసుకోవాలి



కొంపల్లి 1వ వార్డులోని మహిళా భవన్‌ను సందర్శిస్తున్న అడిషనల్ కలెక్టర్ అభిషేక్ అగస్త్య, చైర్మన్ శ్రీశైలంయాదవ్

కుత్బుల్లాపూర్: కంటి సమస్యలతో బాధపడుతున్న ప్రజలు కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలని మేడ్చల్ జిల్లా అడిషనల్ కలెక్టర్ అభిషేక్ అగస్త్య అన్నారు. ఈనెల 19 నుంచి రెండో విడత కంటి వెలుగు కార్యక్రమం ప్రారంభం కానున్న నేపథ్యంలో మంగళవారం కొంపల్లి మున్సిపాలిటీ పరిధి 1వ వార్డులోని మహిళా భవనం, దుండిగల్ మున్సిపాలిటీ పరిధి గాగిల్లాపూర్‌లోని 1వ వార్డు కార్యాలయాన్ని అడిషనల్ కలెక్టర్ సందర్శించి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

◆ ఈ సందర్భంగా ఆయన అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ... కంటి పరీక్షలు చేయించుకునేందుకు సెంటర్లకు వచ్చే ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా సేవలు అందజేయాలన్నారు. రిసోర్స్ పర్సన్‌లు, మెప్మాల ద్వారా ఇంటింటికి వెళ్లి కంటి సమస్యలతో బాధపడుతున్న ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. కంటి వెలుగును సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. కొంపల్లి మున్సిపల్ చైర్మన్ సన్న శ్రీశైలంయాదవ్, మున్సిపల్ కమిషనర్ శ్రీహరి, డీఈఈ చిరంజీవులు, మేనేజర్ శ్రీనివాస్‌గౌడ్, డాక్టర్ నందిని, దుండిగల్ మున్సిపల్ కమిషనర్ భోగీశ్వర్లు, రెవెన్యూ ఆఫీసర్ శ్రీహరిరాజు, ఇంజనీర్ ప్రవీణ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

బిర్యానీ @ రూ.10



సుభాష్‌నగర్: ప్రస్తుతం మార్కెట్‌లో చిన్నచిన్న టిఫిన్ సెంటర్లలో సైతం బిర్యానీ ప్లేట్ ధర రూ.30. మీల్స్ అయితే రూ.70 నుంచి 100కు పైనే. ఇలాంటి తరుణంలో మధ్యప్రదేశ్‌కు చెందిన మహేష్ గాజులరామారం డివిజన్ దేవేందర్‌నగర్‌లో కేవలం రూ.10కే వెజ్ బిర్యానీ అందిస్తున్నాడు. గతంలో అంబర్‌పేట్‌లో నడిపే వాడినని తెలిపాడు. అక్కడ తన కుటుంబ సభ్యులకు అప్పగించి దేవేందర్‌నగర్‌లో బిర్యాని సెంటర్ నడుపుతున్నానని పేర్కొన్నాడు. వచ్చే కొద్దిపాటి లాభాలతో కుటుంబాన్ని నెట్టుకొస్తున్నట్లు మహేష్ తెలిపాడు. ప్రతిరోజు 70 నుంచి 100 ప్లేట్ల వరకు అమ్ముతున్నాడు. అటుగా వెళ్లే వాహనాదారులు రూ.10కే వెజ్ బిర్యానీ బోర్డు చూసి ఒక పట్టు పట్టి వెళ్లిపోతున్నారు.

రద్దీ ప్రాంతాలలో ఎల్లవేళలా గస్తీ ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న స్టీఫెన్ రవీంద్ర

- సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్ర
- నేర నియంత్రణ, పోలీసు దర్యాప్తు తీరుతెన్నులపై సమీక్ష

రాయదుర్గం: కన్విక్షన్ల శాతాన్ని పెంచాలని సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్ర పోలీసులకు దిశానిర్దేశం చేశారు. గచ్చిబౌలిలోని సైబరాబాద్ కమిషనరేట్‌లో మంగళవారం నేరాల నియంత్రణ, పోలీసు దర్యాప్తు తీరుతెన్నులపై సీపీ సమీక్ష చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధి, మాదాపూర్ జోన్‌లోని అన్ని పోలీస్‌స్టేషన్ల సిబ్బంది నేరాల సంఖ్యను తగ్గించే విధంగా కృషి చేయాలన్నారు. రాష్ట్రంలోనే సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని గచ్చిబౌలి, రాయదుర్గం, మాదాపూర్, నార్సింగి తదితర ఐటీ కారిడార్‌లోని ప్రాంతాలు పెట్టుబడలకు ప్రత్యేక ఆకర్షణ ఉన్నందున నేర నియంత్రణ, శాంతి భద్రతలను అదుపులో ఉన్నట్లయితే పారులకు ఉపాధి కల్పన మరింతగా జరుగుతుందన్నారు. విజిబుల్ పోలీసింగ్, ప్రొయాక్టివ్ పోలీసింగ్ పద్ధతులు, రద్దీ ప్రాంతాలలో, కూడళ్లలో గస్తీ వాహనాలు ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ముఖ్యంగా సెక్టార్ ఎస్‌ఐలు బేసిక్ పోలీసింగ్‌పై దృష్టి సారించాలన్నారు. ఈ సమావేశంలో సైబరాబాద్ క్రైమ్స్ డీసీపీ కల్మేశ్వర్‌సింగన్వర్, మాదాపూర్ డీసీపీ శిల్పవల్లి, అడ్మిన్ డీసీపీ ఇందిర, సైబర్ క్రైమ్స్ అడిషనల్ డీసీపీ రితిరాజ, క్రైమ్స్ ఏడీసీపీ నర్సింహారెడ్డి, ఎస్బీ ఏడీసీపీ రవికుమార్, ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు, డీఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

13 మందికి కోవిడ్ నెగిటివ్

కుత్బుల్లాపూర్: జంట సర్కిళ్ల పరిధిలో కోవిడ్-19 నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. మంగళవారం సూరారం కాలనీలోని యూపీహెచ్‌సీలో 13 మందికి పరీక్షలు చేశారు. అందులో అందరికి నెగిటివ్ రిపోర్టులు వచ్చినట్లు వైద్యాధికారులు తెలిపారు. ఎవరైనా జ్వరం, దగ్గు, గొంతు నొప్పి లక్షణాలతో బాధపడుతుంటే వెంటనే కోవిడ్ పరీక్షలు చేయించుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

సమస్యలు లేని డివిజన్‌గా తీర్చిదిద్దుతున్నాం

జగద్గిరిగుట్ట: సమస్యలు లేని డివిజన్‌గా జగద్గిరిగుట్టను తీర్చిదిద్దుతున్నామని కార్పొరేటర్ జగన్ అన్నారు. మంగళవారం డివిజన్ పరిధిలోని సంజయ్‌పురి కాలనీలో జలమండలి డైరెక్టర్ స్వామి, కుత్బుల్లాపూర్ జీఎం శ్రీధర్‌రెడ్డి లతో కలిసి కార్పొరేటర్ పాదయాత్ర చేసి స్థానికంగా నెలకొన్న తాగునీరు, డ్రైనేజీ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. త్వరలోనే కొత్త తాగునీటి పైపులైన్ల, భూగర్భ డ్రైనేజీ లైన్ పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేసి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. బీఆర్‌ఎస్ నాయకులు మల్లేష్‌గౌడ్, వెంకటేశ్వర్లు, దామోదర్‌రావు, అప్పల శ్రీను, అరుణ్, కిరణ్, వెంకటేష్, లక్ష్మణరావు, అరవింద్, నరసింహచారి, మాణిక్‌చంద్, సునీల్ తదితరులు ఉన్నారు.

బీజేపీపై పోరాటానికి సిద్ధం కావాలి

కుత్బుల్లాపూర్: ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ, ఎస్‌ఎస్‌ఎస్‌ల ఆధ్వర్యంలో మంగళవారం ఛలో గండిపేట్ ముఖ్య కార్యకర్తల సమావేశానికి కుత్బుల్లాపూర్ నుంచి పెద్ద సంఖ్యలో తరలి వెళ్లారు. బహుజన సోషలిస్ట్ పార్టీ అధినేత మంద కృష్ణమాదిగ సారథ్యంలో బీజేపీపై పోరాటానికి సిద్ధం కావాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను ఏకం చేసి పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని నాయకులు పేర్కొన్నారు. సిలువేరు శ్రీనివాస్‌మాదిగ, యాదగిరిమాదిగ, సంజీవ,రమేష్‌మాదిగ,నరసింహులు మాల, మహేష్, జ్యోతి, చిన్నమ్మ, ఎస్తేరురాణి, మల్లేశ్వరి, గీత తదితరులు తరలివెళ్లారు.

హెచ్‌సీయూ-టీఐఎఫ్ఆర్ ఒప్పందం

విద్య, పరిశోధన రంగాల్లో పరస్పర సహకారం



ఒప్పంద కార్యక్రమంలో వీసీ ప్రొ.బీజేరావు, ఇరు సంస్థల ప్రతినిధులు

రాయదుర్గం: విద్య, పరిశోధనా రంగాలలో పరస్పర సహకారం అందిపుచ్చుకోవడానికి హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్‌సీయూ), టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్-హైదరాబాద్ (టీఐఎఫ్ఆర్-హెచ్) మధ్య ఒప్పందం కుదిరింది.ఈ మేరకు మంగళవారం రెండు సంస్థల ప్రతినిధులు సంతకాలు చేశారు. భౌతిక శాస్త్రం, రసాయన శాస్త్రంలో తమ సామర్థ్యాన్ని తదుపరి స్థాయికి తీసుకెళ్ళడానికి శ్రేష్టత, మానవ వనరుల అభివృద్ధికి ప్రణాళిక రూపొందించుకున్నాయి. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఉపన్యాసాలు, వర్క్‌షాప్‌లు, సమావేశాలు, సెమినార్లు సంయుక్తంగా నిర్వహించేందుకు నిర్ణయించారు. హెచ్‌సీయూ వీసీ ప్రొఫెసర్ బీజేరావు, రిజిస్ట్రార్ దేవేష్‌నిగమ్, ప్రొఫెసర్ జగన్ ఎంఆర్, టీఎఫ్ఐఆర్ నుంచి అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వృథాగా పబ్లిక్ టాయిలెట్లు



జగద్గిరిగుట్ట కొండపై ఉన్న టాయిలెట్లు

జగద్గిరిగుట్ట: జగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలో పబ్లిక్ టాయిలెట్ల నిర్వహణ లోపం కారణంగా వృథాగా పడి ఉన్నాయి. మూడు సంవత్సరాల క్రితం వివిధ ప్రాంతాలలో అధికారులు మైల్డ్ స్టీల్, బయో టాయిలెట్లను అమర్చారు. కాని వాటి నిర్వహణ మాత్రం మరిచారు. దీంతో లోపల ఉన్న సామగ్రిని అందినకాడికి దోచుకెళుతున్నారు. ఒకటి రెండు చోట్ల మాత్రమే నిర్వహణ బాగుంది. కాని మిగితా చోట్ల పనికి రాకుండా పోయాయి. జగద్గిరిగుట్ట కొండపై అమర్చిన టాయిలెట్లలో తాళం పగలగొట్టి మరీ సామగ్రిని ఎత్తుకెళ్లారు. ఇక మోడల్ మార్కెట్ సమీపంలో, దేవమ్మ బస్తీలో కూడా అదే పరిస్థితి. ఇప్పటికైనా అధికారులు టాయిలెట్ల నిర్వహణపై చొరవ చూపి ప్రజలకి అందుబాటులోకి తేవాలని పలువురు అభిప్రాయ పడుతున్నారు.

క్రైం కార్నర్..

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు



చికిత్స పొందుతున్న గణేష్

భాగ్యనగర్‌కాలనీ: రెండు మోటార్ సైకిళ్లు ఢీకొట్టుకున్న సంఘటనలో ఓ వ్యక్తికి తీవ్రగాయాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సంఘటన కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం రాత్రి సమయంలో బాలానగర్‌లోని అంబేడ్కర్‌నగర్ వద్ద పల్సర్ బైక్ (టీఎస్08హెచ్ జే5288)పై అతి వేగంగా వెళ్తున్న ఓ వ్యక్తి మరో ద్విచక్రవాహనాన్ని (టీఎస్11 ఈ3393) ఢీకొట్టాడు. వెనుక నుంచి ఢీకొట్టిన వాహనదారుడు గరక గణేష్ (20) వెంటనే కింద పడిపోవటంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న కూకట్‌పల్లి పోలీసులు గణేష్‌ను ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలి



ఎమ్మెల్యే కృష్ణారావు, కార్పొరేటర్ జూపల్లిని సన్మానిస్తున్న కార్యకర్తలు, నాయకులు

- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి డివిజన్ బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తల సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, స్థానిక కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణలు పాల్గొన్నారు. ఎమ్మెల్యే కృష్ణారావును పార్టీ నాయకులు, కార్యకర్తలు గజమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కృష్ణారావు మాట్లాడుతూ... రానున్న ఎన్నికల్లో ప్రతి కార్యకర్త వీర సైనికుడిలా పనిచేయాలన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ అందజేస్తున్న ప్రభుత్వ పథకాలను ఇంటింటికి తీసుకెళ్లి వివరించాలని సూచించారు. పార్టీలో కష్టపడి పనిచేసే వారికి భవిష్యత్‌లో మంచి గుర్తింపు ఉంటుందని తెలిపారు. తిరిగి కూకట్‌పల్లి నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ పార్టీ జెండా ఎగరవేసే విధంగా కార్యకర్తలంతా సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు.

ఘనంగా శ్రీకృష్ణదేవరాయల జయంతి



నివాళులర్పిస్తున్న కాపు మిత్ర సంఘం ప్రతినిధులు

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ శ్రీవివేకానందనగర్‌లో శ్రీకృష్ణదేవరాయ కాపు మిత్ర సంఘం వివేకానందనగర్ ఆధ్వర్యంలో మంగళవారం కృష్ణదేవరాయల జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాపుమిత్ర ప్రతినిధులు శ్రీకృష్ణదేవరాయలు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కృష్ణదేవరాయలు పాలించిన రాజ్యంలో ప్రజలందరు సుఖ సంతోషాలతో కాలం గడిపారని అన్నారు. ఈ కార్యక్రమంలో సుందర శేషవరావు, కొండవీటి అజయ్, రావూరి శ్రీనివాసరావు, బ్యాగి సత్యనారాయణ, అతగముడి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన సంక్రాంతి సంబురాలు





శిల్పారామంలో సంక్రాంతి సంబురాలు మంగళవారం ముగిశాయి.గంగిరెద్దుల విన్యాసాలు, పిట్టలదొర, జంగమదేవరల మాటల గారడీ సందర్శకులను అలరించాయి. అలాగే సాంస్కృతిక కార్యక్రమాల్లో భరత నాట్యాలయ గురువు చిత్ర నారాయణ శిష్య బృందం భరతనాట్య ప్రదర్శన అలరించింది. ఇందులో స్వరాంజలి, గణేశ పంచరత్న, శ్లోకాలు, అమ్మవర్ణం, తిల్లాన తదితర అంశాలను ప్రదర్శించారు. కళాకారులు లక్ష్మిశరణ్య, ఆశ్రిత, అర్పి, సుమేధ, శ్రీయ, విష్ణుప్రియ, సంజన, హన్సిక, వర్షిణి పాల్గొన్నారు. -మాదాపూర్

నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయాలి



క్యాంపు కార్యాలయంలో విద్యుత్ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గాంధీ

- ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ
- విద్యుత్ అధికారులతో సమీక్ష సమావేశం

మియాపూర్ : శేరిలింగంపల్లి నియోజకవర్గ ప్రజలకు మెరుగైన విద్యుత్ సరఫరా చేయాలని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అధికారులకు సూచించారు. మియాపూర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం నియోజకవర్గ పరిధిలో విద్యుత్ సమస్యలు, అభివృద్ధి పనులపై విద్యుత్ అధికారులతో టీఎస్ఎస్‌పీడీసీఎల్ డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, కార్పొరేటర్లు, అధికారులతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలో ఎలాంటి అవాంతరాలు లేకుండా నిరంతరాయ విద్యుత్ సరఫరా చేయాలని అధికారులకు సూచించారు. విద్యుత్ అధికారులు సమన్వయంతో పనిచేసి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని తెలిపారు. నియోజకవర్గంలో శిథిలావస్థకు చేరుకున్న కరెంట్ స్తంభాలను తొలగించి వాటి స్థానంలో కొత్త వాటిని ఏర్పాటు చేయాలన్నారు. బస్తీలలో అవసరమైన చోట త్రీఫేజ్ కనెక్షన్ ఇవ్వాలని, ఇళ్లపై ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ తీగలను తొలగించాలని ఆదేశించారు. అలాగే రోడ్డుపై ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లను తొలగించడం, ఉన్న ట్రాన్స్ ఫార్మర్లకు రక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎమ్మెల్యే తెలిపిన సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. విద్యుత్ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి నివేదిక అందజేసి సమస్యలను పరిష్కరించాలని, విద్యుత్ అంతరాయం లేకుండా చూస్తామన్నారు. కార్యక్రమంలో అధికారులు ఎస్ఈ వెంకన్న, సీజీఎం ఆనంద్, డీఈ గోపాలకృష్ణ, రాజు, చక్రవర్తి, ఏడీలు రాములు, ప్రసాద్, మల్లేష్, శ్యాంప్రకాష్, కార్పొరేటర్లు హమీద్‌పటేల్ , నాగేందర్‌యాదవ్, జగదీశ్వర్‌గౌడ్, వెంకటేష్‌గౌడ్, సింధూ ఆదర్శ్‌రెడ్డి, శ్రీనికాంత్, మాజీ కార్పొరేటర్ సాయిబాబా, రంగారావు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.